క్లుప్తంగా

పెన్సిల్‌పై అమ్మవారి తొమ్మిది రూపాలు


పెన్సిల్‌పై అమ్మరి చిత్రాలు

నంద్యాల(అర్బన్): దసరా నవరాత్రులను పురస్కరించుకొని పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ చిన్న కలర్ పెన్సిల్‌పై చుట్టూ మూడువైపులా 9 రూపాలతో అమ్మవారి సూక్ష్మ చిత్రాన్ని మైక్రో పెన్‌తో 30 నిమిషాల వ్యవధిలో వేశారు. పెన్సిల్‌పై శైలపుత్రి, బాలాత్రిపురసుందరి, కుష్మాండ దుర్గ, బ్రహ్మచారిణి, స్కందమాత, కాత్యాయని, భద్రకాళి, దుర్గాదేవి, మహిషాసురమర్దిని రూపాలు చిత్రించారు.

భగ్గుమంటున్న టమాట

గోస్పాడు: నిత్యావసర సరుకులు, కూరగాయలు, విద్యుత్, గ్యాస్, ఇంధన తదితర వాటి ధరలు నిత్యం పెరుగుతూనే పోతున్నాయి. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం టమాట ధర ఆకాశాన్నంటింది. ధరలు పెరుగుతున్నా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వారం వరకు రూ.15 నుంచి రూ. 20 వరకు కిలో టమాట ధర ఆరు రోజుల నుంచి కొండెక్కింది. ప్రస్తుతం రూ. 80 నుంచి రూ.100 వరకు పలుకుతుండటంతో జనం వాటిని చూడటానికి జంకే పరిస్థితి నెలకొంది. నిత్యం వంటకాల్లో టమాట ధర కూడా పెరగడంతో ఏమి తినాలో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు.

పెద్దమ్మా... చల్లంగా చూడమ్మా


ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మ అమ్మవారు ఆదివారం ప్రత్యేక పూజలు అందుకున్నారు. వేకువజామునుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పెద్దమ్మా.. చల్లంగా చూడమ్మా అంటూ గాజులు, నిమ్మకాయలు, చీరెలు, పిండివంటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

11 నుంచి సీమ స్థాయి వాలీబాల్ పోటీలు

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈ నెల11, 12 తేదీలలో సీమ స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పీఈటీలు షరీఫ్, భార్గవ తెలిపారు. వారు మాట్లాడుతూ చాగలమర్రి గ్రామానికి చెందిన వాలీబాల్ యువ క్రీడాకారుడు సిద్ధిఖ్ నెల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని, అతని జ్ఞాపకార్థం టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 10 వేలు, 7 వేలు, 5 వేలు చొప్పున అందజేస్తామన్నారు. వివరాలకు 8465077844, 6304671435 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

హ్యాండ్ బాల్ జిల్లా జట్టుకు శిక్షణ

చాగలమర్రి: చాగలమర్రిలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం సీనియర్ మెన్ హ్యాండ్ బాల్ జిల్లా జట్టు క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారు. ఈ నెల 9,10వ తేదీలలో చాగలమర్రిలో నిర్వహించే హ్యాండ్ బాల్ సీనియర్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు శిక్షకుడు సురేంద్ర తెలిపారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్ బాల్ కార్యదర్శి మహబూబ్‌బాషా, సంయుక్త కార్యదర్శి కడ్డీ మహబూబ్‌బాషా, పీటీలు దాదాపీర్, షేక్షావలి, బషీర్, విద్యాకమిటీ చైర్మన్ గౌస్, ఉసేన్‌వలి, సమీవుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

బొమ్మలసత్రం: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నేరాలకు పాల్పడుతూ సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూ దందాలు, మట్కా తదితర నేరాలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు.

నరసింహానంద సరస్వతిపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): విద్వేష పూరితమైన ప్రసంగాలు చేస్తూ హిందూ, ముస్లింల మధ్య గొడవలు సృష్టించేందుకు యత్నిస్తున్న నరసింహానంద సరస్వతి మహారాజ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌డీపీఐ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ కలాం కోరారు. గజియాబాద్ లోహియా నగర్ హిందీ భవన్‌లోని దాస్నా ఆలయంలో మేజర్ ఆశారామ్ వ్యాగ్ సేవా సంస్థాన్ నిర్వహించిన కార్యక్రమంలో మహమ్మద్ ప్రవక్తపై నరసింహానంద సరస్వతి చేసిన ప్రసంగం రెండు వర్గాల మధ్య గొడవలు సృష్టించేదిగా ఉందని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆదివారం వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

రబీపైనే కోటి ఆశలు!

- రైతన్నను నిరాశపరిచిన ఖరీఫ్
- వర్షాభావ పరిస్థితులతో నష్టపోయిన అన్నదాత
- మొక్కజొన్నకు లభించని గిట్టుబాటు ధర
- ఆర్థిక భారంతో రబీ సాగుకు సిద్ధమవుతున్న రైతన్న
- అందుబాటులో లేని ఎరువులు, విత్తనాలు


ఉయ్యాలవాడ గ్రామ సమీపంలో పప్పుశనగ సాగుకు రసాయనిక ఎరువులు ఎత్తుతున్న రైతు

ఉయ్యాలవాడ : అన్నదాతను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. వర్షాభావ పరిస్థితుల మూలంగా నష్టాలు మూటగట్టుకుంటనే ఉన్నారు. ఈయేడు రైతన్న పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. ఖరీఫ్ సీజన్‌లో ఉయ్యాలవాడ మండలంలో 3,090 హెక్టార్లలో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. ముందస్తు వర్షాలు కురియడంతో ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందకున్నా గంపెడాశతో అప్పులుచేసి సాగు చేపట్టారు రైతులు. అత్యధికంగా వరి 948 హెక్టార్లలో సాగు అయ్యింది. కంది 722 హెక్టార్లులో, పత్తి 471 హెక్టార్లులో, మిరప 358 హెక్టార్లులో, మొక్కజొన్న 303 హెక్టార్లు, మినుము 148 హెక్టార్లులో, పొగాకు 78 హెక్టార్లులో, వేరుశనగ 12 హెక్టార్లు, సోయాబిన్ 27 హెక్టార్లులో రైతులు సాగు చేశారు. అదేవిధంగా పొద్దుతిరుగు, ఆముదం, నువ్వులు తదితర పంటలు 30 హెక్టార్లలో సాగు అయ్యింది. మొక్కజొన్న, మినుము మినహా మిగిలిన పంటలు వివిధ దశల్లో ఉన్నాయి. మొక్కజొన్న, మినుము పంటల నూర్పిడి దాదాపు పూర్తికావచ్చాయి. అయితే దిగుబడులు తగ్గిపోవడంతోపాటు ధర సైతం లేకపోవడంతో రైతన్నకు నిరాశే మిగిలింది. ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న, మినుము సాగు చేసిన రైతులు నష్టాన్ని ఓర్చుకుంటూ రబీపై కోటి ఆశలతో శనగ సాగుకు సన్నద్ధం అవుతున్నారు.

పప్పుశనగ సాగుకు సన్నద్ధం

ఖరీఫ్ సాగు రైతన్నకు పూర్తిగా కలిసి రాలేదు. అక్టోబర్ ప్రారంభం నుంచే రబీ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు రైతులు. అయితే ఇంతవరకు పెట్టుబడి సాయం ఊసెత్తని టీడీపీ కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తుందని రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెట్టుబడి సాయం ఏకంగా రూ. 20 వేలు అందజేస్తామని ఎన్నికల ముందు ఊదరగొట్టిన కూటమి పెద్దలు గద్దెనెక్కాక ఏ మాత్రం పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. రబీ సీజన్ ప్రారంభమైనా విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేకపోవడంతో కూటమి ప్రభుత్వ తీరును తప్పుపడుతున్నారు రైతులు. గతేడాది ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యధికంగా ఉయ్యాలవాడ మండలంలో 12,500 హెక్టార్లలో పప్పుశనగ సాధారణ సాగు విస్తీర్ణం. ఈ ఏడాది మరో 500 హెక్టార్లలో సాగు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. అయితే పప్పుశనగ విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వానికి నివేదికలు



మండల పరిధిలోని ప్రతి రైతు సేవా కేంద్రానికి 20 మెట్రిక్ టన్నుల డీఏపీ, 10 టన్నుల యూరియా ఎరువుల కోసం నివేదికలు పంపాం. ఎరువులు ఇంత వరకు సరఫరా కాలేదు. రైతులు రబీలో సాగు చేయనున్న పప్పు శనగ రాయితీ విత్తనాలు సబ్సిడీపై అందజేసేందుకు రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించాం. ఎకరాకు 20 కేజీల నుండి గరిష్టంగా 5 ఎకరాల్లోపు రైతులకు 2 క్వింటాళ్లు ప్రభుత్వం అందిస్తుందన్నారు. సబ్సిడీపోను క్వింటాంకు రూ. 7,050 రైతులు చెల్లించాల్సి ఉంటుంది.

– సుధాకర్‌రెడ్డి, మండల ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి, ఉయ్యాలవాడ

తగ్గిన మొక్కజొన్న దిగుబడులు


రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్న దిగుబడులు

వర్షాభావ పరిస్థితుల మూలంగా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న, మినుము దిగుబడులు తగ్గాయి. ముందస్తు వర్షాలు కురిసినప్పటికీ అదును సమయంలో వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో ఎండు తెగులు మొక్కజొన్నను ఆశించింది. దిగుబడులు బాగా తగ్గాయని మొక్కజొన్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది మొక్కజొన్న ఎకరాకు 7 నుంచి 8 బస్తాలు దిగుబడులురాగా ప్రస్తుతం ఐదు బస్తాలు 4 నుంచి 5 బస్తాలు మాత్రమే వచ్చాయని రైతులు అంటున్నారు. అదేవిధంగా మినుము దిగుబడులు సైతం పూర్తిగా తగ్గిపోయాయి. ఇక ధర విషయానికొస్తే గత నెల సెప్టెంబర్‌లో క్వింటాం రూ. 2,950 ఉండగా, ప్రస్తుతం రూ. 2,350 మాత్రమే ఉంది. ఈయేడు ఆదాయం లేనట్లేనని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నేడు వలంటీర్ల శాంతియుత ర్యాలీ

నంద్యాల(అర్బన్): స్థానిక బొమ్మలసత్రం వద్ద నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు సోమవారం నంద్యాల జిల్లా గ్రామ, వార్డు వలంటీర్ల శాంతియుత ర్యాలీ నిర్వహిస్తామని వలంటీర్ అసోసియేసన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హుమయూన్ బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఉద్యోగభద్రత, బకాయి వేతనాలు, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలుపుకోవాలని కోరుతూ నిర్వహిస్తున్న ర్యాలీకి జిల్లాలోని వలంటీర్లందరూ హాజరు కావాలని కోరారు.

నేడు రాయితీ శనగల పంపిణీ

నంద్యాల(అర్బన్): స్థానిక టెక్కె మార్కెట్ యార్డులో సోమవారం మండలంలోని గుంతనాల, మిట్నాల, పుసులూరు, పులిమద్ది, భీమవరం, ఊడుమాల్పురం, మూలసాగరం గ్రామాల రైతులకు రాయితీ శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి మంజూరైన 186 క్వింటాళ్ల జేజీ-11 రకం విత్తనాలను 25శాతం సబ్సిడీతో రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఫరూక్ పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో వన్య ప్రాణుల సంరక్షణ

చాగలమర్రి: పర్యావరణ పరిరక్షణతో వన్య ప్రాణుల సంరక్షణ సాధ్యమని డి.వనిపెంట సెక్షన్ అధికారి టి.రామక్రిష్ణ తెలిపారు. వన్య ప్రాణి సంరక్షణ వారోత్సవాలలో భాగంగా ఆదివారం మండలంలోని డి.వనిపెంట అటవీ సెక్షన్ పరిధిలోని చింతలచెరువులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణం బాగుండాలంటే చెట్లను పెంచాలని, అడవులను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక బీట్ ఆఫీసర్లు శ్రీమధన్ గోపాల్, శ్రీజంగం శుభాష్, బేస్ క్యాంపు పోరటెక్షన్ వాచర్ నరసింహా, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలి


అప్పనపల్లె లో మొక్క జొన్న దిగుబడులను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

రుద్రవరం: మొక్క జొన్నలు క్వింటాం రూ.3,300 చొప్పున గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కోటకొండ, ఎల్లావత్తుల, పెద్దకంబలూరు, అప్పనపల్లె, రుద్రవరం, నర్సాపురం గ్రామాల మీదుగా ఆదివారం వారు వెళ్తు రోడ్లపై రైతులు ఆరబోసిన మొక్క జొన్న దిగుబడులను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ దళారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి రూ.3,300 ప్రకారం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, బాలనరసింహ్ములు తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్నను ఆదర్శంగా తీసుకుందాం


వడ్డె ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీని భారత దేశం నుంచి తరిమేందుకు మహా ఉద్యమం చేసిన వడ్డె ఓబన్నను ఆదర్శంగా తీసుకుందామని వడ్డెర సంఘం జాతీయ కార్యదర్శి శిల్పి సుబ్బరాయుడు తెలిపారు. వడ్డె ఓబన్న 178వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక కార్యాలయంలో ఆదివారం సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశ స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం, రైతుల హక్కుల కోసం రేనాటి ప్రాంతంలో పోరాడిన మహాధీరుడు వడ్డె ఓబన్న అని కొనియాడారు. ఆయన చేసిన ఉద్యమమే ఝాన్సీ లక్ష్మీబాయి సిపాయిల తిరుగుబాటుకు నాంది అయ్యిందన్నారు.సంఘం రాష్ట్ర కార్యదర్శి చల్లా వెంకటేశ్, గోపాల్, శివ భాస్కర్, మహేష్, మద్దిలేటి, వెంకట సుబ్బయ్య, వాసు పాల్గొన్నారు.

సాహితీ కల్హారమాల పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): తెలుగు పాఠకలోకంలో కొండూరు శ్రీదేవి సుప్రసిద్ధమైన రచనలతో వెలుగొందుతున్నారని ప్రఖ్యాత సాహితీవేత్త డాక్టర్ గౌరీ శంకర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో సాహితీ కల్హారమాల పుస్తకావిష్కరణ, తెలుగు సాహిత్యం- శ్రీదేవి రచనలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రసిద్ధ సాహితీవేత్తలు డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు, డాక్టర్ వైష్ణవ వెంకటరమణమూర్తి, డాక్టర్ కళామురళీ, డాక్టర్ ఉదయ్‌శంకర్, డాక్టర్ కిశోర్‌కుమార్, చిట్టిబొట్ల మధుసూదనశర్మ, సాహితీ సంస్థల ప్రతినిధులు అన్నెం శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసమూర్తి, నీలం వెంకటేశ్వర్లు, నీలంకఠమాచార్యులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ తెలుగు కవుల పరిచయాన్ని కవితా రూపంలో సాహితీ కల్హారమాల పుస్తకం ద్వారా వెలుగులోకి తెచ్చారన్నారు. సాహితీ వేత్తలు నరేంద్ర, మహబూబ్‌బాషా, రవి కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక పీఆర్‌సీ ఏర్పాటు చేయాలి

చాగలమర్రి: ఉపాధ్యాయులకు ప్రత్యేక పీఆర్‌సీ ఏర్పాటు చేయాలని ఎస్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి శివశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్‌సీర్సీ అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సమావేశంలో నాయకులు మస్తాన్ బాషా, సుబ్బారావు, మహ బూబ్‌హుసేన్, మహబూబ్‌బాషా, నారాణరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సురేషప్పా, ప్రసాద్, ప్రసాద్, స్వామిరెడ్డి, పుట్టాలయ్య, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక


ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

మద్యం పాలసీపై అవగాహన

దొర్నిపాడు: నూతన మద్యం విధానంపై కోవెలకుంట్ల ఎక్సైజ్ ఎస్‌ఐలు సందీప్ యాదవ్, ప్రవీణ్ కుమార్ నాయక్ స్థానిక ప్రజలకు ఆదివారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ కోవెలకుంట్ల ఎక్సైజ్ శాఖ పరిధిలో 11 షాప్‌లకు అనుమతులు వచ్చాయన్నారు. అందులో కోవెలకుంట్ల -5, సంజామల-4, దొర్నిపాడు-1, ఉయ్యాలవాడ-1 కేటాయించడం జరిగిందన్నారు.

ఉయ్యాలవాడ : మండల కేంద్రమైన ఉయ్యాలవాడకు ప్రభుత్వం కేటాయించిన మద్యం దుకాణాన్ని దక్కించుకునేందుకు టెండర్లు వేయాలని కోవెలకుంట్ల ఎక్సైజ్ ఎస్‌ఐ ప్రవీణ్‌నాయక్ సూచించారు. ఆదివారం మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో నూతన మద్య విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ కోవెలకుంట్ల పరిధిలో 11 దుకాణాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ హనుమంతు, సూపర్‌వైజర్ సురేంద్రలు పాల్గొన్నారు.

12వ పీఆర్‌సీ అమలు చేయాలి


మాట్లాడుతున్న చెన్నుపాటి మంజుల

నంద్యాల (న్యూటౌన్): రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కార్మికులకు 12వ పీఆర్‌సీ అమలు చేయాలని, అలాగే.. ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జిల్లా ఉద్యమ అధ్యయన తరగతులను స్థానిక నేషనల్ పీజీ కాలేజీలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగాయి. సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి మంజుల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి, పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్ మాట్లాడుతూ.. దృక్పథం, పని విధానం, ఉద్యమ చరిత్ర, విద్యారంగ పరిణామాలు అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే విడుదల చేయాలన్నారు. 117 జీఓతో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయ్యాయని, తక్షణమే సదరు జీఓను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ శివయ్య, రాష్ట్ర కార్యదర్శి రవి కుమార్, చెంచు రెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాల నాగిరెడ్డి ,రాష్ట్ర కౌన్సిలర్ సుందర్ రావు, సుకుమాంబ కుమారి, జిల్లా సబ్ కమిటీ సభ్యులు దస్తగిరి బాషా, తిమ్మారెడ్డి, మధు, రమేష్, రాములమ్మ, శైలజ, రమాబాయి, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

బాలాత్రిపుర సందరీ దేవి అలంకరణలో అమ్మవారు


పసురపాడు, గోస్పాడులో శ్రీలలితా త్రిపురసుందరిదేవి అలంకరణలో అమ్మవారు


ఆళ్లగడ్డ : అమ్మవారి శాలలో బాలాత్రిపుర సందరీ దేవిని దర్శించుకుంటున్న భక్తులు



ఉయ్యాలవాడ : లలితా త్రిపురా సుందరి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


దొర్నిపాడు: బాలాత్రిపురసుందరిదేవీగా..

ఆళ్లగడ్డ: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వాసవీమాత బాలాత్రిపుర సందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని అమ్మవారిశాలలో కొలువైన శ్రీమత్కన్యకా పరమేశ్వరీ దేవీ బాలాత్రిపుర సందరీ దేవి అలంకరణలో భక్తులను కనువిందు చేశారు.

ఉయ్యాలవాడ : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఇంజేడు గ్రామంలో చౌడేశ్వరి దేవి లలిత త్రిపుర సుందరిదేవిగా, ఉయ్యాలవాడలో మారెమ్మతల్లి త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

దొర్నిపాడు: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు ఆదివారం బాలత్రిపుర సుందరిదేవీగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉభయదారులు రాధకృష్ణమూర్తి, చంద్రశేఖర్ కుటుంబాలు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అంజనీ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

గోస్పాడు: మండల కేంద్రంతో పాటు, పసురపాడు, యాళ్లూరు గ్రామాల్లో దసరా పండుగను పురస్కరించుకొని అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆదివారం అమ్మవార్లు శ్రీలలితా త్రిపురసుందరిదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా అమ్మవారికి నిర్వాహకులతో పాటు భక్తులు ప్రత్యేక పూజలుచేశారు.

శిరివెళ్ల: మండలంలో దేవీ శరన్నవ రాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం రాజరాజేశ్వరి దేవీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శన మిచ్చారు. పూజా ఉభయ దాతలతో పూజారి కేశవశర్మ అమ్మవారికి విశేష పూజలు జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు.

రుద్రవరం: స్థానిక కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శరన్నవ రాత్రోత్సవాలు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చోలవేటి సూర్యనారాయన ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారు ధనలక్ష్మిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా ఎల్లావత్తులలో అమ్మవారు లలిత త్రిపుర సందరి ఆలంకరణలో భక్తులను ఆకట్టుకున్నారు.

చాగలమర్రి: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రం చాగలమర్రిలో వెలసిన శ్రీమత్కన్యకాపరమేశ్వరీ దేవి శ్రీగాయత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు పులేటికుర్తి రాధాకృష్ణస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాశ్వత ఉభయదారులు తొమ్మండ్రు గురు నాగేంద్ర, సుబ్రమణ్యం, రమేష్‌బాబు కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షులు వంకదార లక్ష్మణబాబు, పాలకవర్గ ఉపాధ్యక్షులు మల్లికార్జున, సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఉప కార్యదర్శి జ్వాలా నర్సింహ్మయ్య, కోశాధికారి కూరపాటి రామకృష్ణ వరప్రసాద్, ఉప కోశాధికారి సుంకు జగదీష్, దర్మకర్త క్రిష్ణం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో...

మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో వెలసిన శ్రీమత్కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శ్రీపార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ముడియం నరసింహారావు, కోశాధికారి మధవ నరసింహ్మయ్య, ఉపాధ్యక్షుడు రామక్రిష్ణ, సురేష్‌బాబు, కార్యదర్శి గోపాలక్రిష్ణ, ఉప కార్యదర్శి వెంకట రమేష్‌లు పాల్గొన్నారు.



చాగలమర్రి : గాయత్రీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు


రుద్రవరం: ధనలక్ష్మీదేవిగా అమ్మవారు


శిరివెళ్ల:రాజరాజేశ్వరి దేవీ అలంకారంలో...

అహోబిలంలో శాస్త్రోక్తంగా నవరాత్రోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో ఉభయ దేవేరులతో కొలువైన ప్రహ్లాదవరదుడు

ఆళ్లగడ్డ : ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవ వేడుకలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం దిగువ అహోబిలంలో కొలువైన మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరద స్వాములను కొలువుంచి నవకళస్థాపన, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించి అనంతరం ఉత్సవ మూర్తులను అద్దాల మండపంలో కొలువుంచి ఊంజల్ సేవ నిర్వహించారు.

అపూర్వ సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలోని అప్పటి ఆర్‌సీఎం ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల (1998–99 పది బ్యాచ్) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉల్లాసంగా సాగింది. దాదాపు 26 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై చేరిన చిన్ననాటి మిత్రులు ఒకరినొకరు పలుకరించుకుంటూ సంతోషంగా గడిపారు. పాత జ్ఞాపకాలు గుర్తు నెరమవేసుకున్నారు. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, కర్నూలు, కడప, అనంతపురం తదితర ప్రాంతాల్లో స్థిరపడిని పూర్వ విద్యార్థులు యోగక్షేమాలు తెలుసుకుని ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యా, బుద్ధులు నేర్పిన అప్పటి గురువులను పూర్వ విద్యార్థులు సన్మానించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం దివంగతులైన ఉపాధ్యాయులు సురేష్‌వర్మ, నారాయణమ్మ, విద్యార్థులు శ్రీలక్ష్మీ, మహబూబ్‌పీరా, వరప్రసాద్‌ల ఆత్మకు శాంతికలగాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు.